క్లుప్తంగా

సబ్‌సెంటర్ తనిఖీ



తాడూరు: మండలంలోని మేడిపూర్ సబ్‌సెంటర్‌ను శుక్రవారం మండల వైద్యాధికారి సంతోష్‌అభిరాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌సెంటర్‌లోని మందులతో పాటు రోగుల వివరాలు, వివిధ రకాల రిజిస్టర్లను పరిశీలించారు. త్వరలో మేడిపూర్‌లో ప్రారంభించే కంటి వెలుగు పరీక్ష కేంద్రానికి అనువైన భవనాన్ని ఎంపిక చేయాలని ఏఎన్‌ఎం చారమ్మ, పంచాయతీ కార్యదర్శి సుభాకర్‌లను కోరారు.

బీహార్ తరహాలో కులగణన చేపట్టాలి

నాగర్‌కర్నూల్ రూరల్: బీహార్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో కూడా బీసీ కులగణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు అరవింద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కుల ఘణన గాలికి వదిలేసిందని ఆరోపించారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీహార్ సీఎం నితీష్‌కుమార్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని బీసీ కుల గణన చేపట్టి మంచి చరిత్రకు నాంది పలికారని అన్నారు. సహించలేని హేతువాదులు సుప్రీం కోర్టులో కేసు వేయడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు పెద్దన్నయాదవ్, తాల్ల నిరంజన్, కుంభం మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

అచ్చంపేట రూరల్: సారా కాసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పులిజాల గ్రామ శివారులో గస్తీ నిర్వహిస్తుండగా.. బైక్‌పై సారా తరలిస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. బైక్‌పై 7.5 లీటర్ల సారా తరలిస్తున్న గోపాల్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని చెప్పారు. సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం సరఫరా చేసే వారిని గుర్తించి పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు బాలరాజు, సతీష్‌కుమార్, సిబ్బంది బంతిలాల్, పరమేష్ పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు



ఉప్పునుంతల: విద్యార్థులు ప్రణాళిక ప్రకారం పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు వస్తాయని విజువల్ విద్య రూపకర్త దేవేంద్రచారీ అన్నారు. శుక్రవారం ఉప్పునుంతల జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై నిర్వహించిన ప్రేరణా తరగతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరీక్ష ఫలితాల్లో 10 జీపీఏ సాధించాలనే లక్ష్యంతో శ్రద్ధగా పునశ్చరణ చేస్తూ ప్రణాళిక ప్రకారం చదువుకుంటే తప్పనిసరిగా మంచి ఫలితం వస్తుందన్నారు. అదేవిధంగా పరీక్ష విధానంపై విద్యార్థులు అవగాహన పెంచుకొని ఆత్మవిశ్వాసంతో విజయం సాధిస్తాననే నమ్మకంతో పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్ష సమయంలో మొదట ప్రశ్నాపత్రాన్ని క్షుణ్ణంగా చదివి తడబడకుండా సరైన రీతిలో జవాబులు రాయాలని సూచించారు. హెచ్‌ఎం హన్మంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుడికి గాయాలు

కోడేరు: మండల కేంద్రంలో ఓ బాలుడు ఆడుతూ ట్రాక్టర్ పైనుంచి కింద పడి తీవ్ర గాయాలపాలైన సంఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కోడేరుకు చెందిన తెలుగు రమేష్ చిన్న కుమారుడు శరత్ శుక్రవారం సాయంత్రం పాఠశాల వదిలిన తర్వాత ఇంటికి వచ్చాడు. తోటి స్నేహితులతో ఇంటి ఎదుట ఉన్న ట్రాక్టర్ ట్రాలీపైకి ఎక్కి ఆడుతూ కింద పడిపోయాడు. తలకు గాయాలు కావడంతో మాటలు పడిపోయాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బీజేపీ నాయకుడిపై దాడి

ఊర్కొండ: మండలంలోని నర్సంపల్లి సర్పంచ్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్‌పై బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం దాడి చేశారు. మండల కేంద్రంలోని కోదాడ- జడ్చర్ల ప్రధాన రహదారి ఇరువైపుల చేసిన వెంచరుపై అక్రమాలకు పాల్పడ్డారని బీజేపీ నాయకుల ఫిర్యాదు మేరకు డీటీసీపీ అధికారులు పరిశీలనకు వచ్చారు. దాంతో విచారణ నిర్వహిస్తుండగా.. నిరంజన్‌గౌడ్‌పై బీఆర్‌ఎస్ నాయకులు దాడికి పాల్పడ్డారు. దాడికి పాల్పడ్డ వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని కోదాడ-జడ్చర్ల ప్రధాన రహదారిపై బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ధర్నా నిర్వహిస్తుండగా పోలీసులు అక్కడికి చేరుకొని విరమింపజేశారు. అక్కడే ఉన్న కొందరు బీఆర్‌ఎస్ నాయకులు, బీజేపీ నాయకులు ఇరువైపుల నుంచి దాడికి పాల్పడేయత్నం చేసుకుంటుండగా సీఐ అవుల సైదులు, కల్వకుర్తి ఎస్‌ఐ రమేష్, స్థానిక ఎస్‌ఐ లక్ష్మణ్ వారిని చెదరగొట్టారు.

కొనసాగుతున్న కంటి వెలుగు



ఉప్పునుంతలలో శిబిరాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ

ఉప్పునుంతల: మండల కేంద్రంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం జిల్లా అడిషనల్ డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ, డీపీఎం శ్రీనివాసులు, ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు పరిశీలించారు. కంటి పరీక్షల కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా శ్రద్ధ తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని ఉప్పునుంతల, ఉప్పరిపల్లి రెండు గ్రామాల్లో నిర్వహించిన కంటి వెలుగు శిబిరంలో రెండో రోజు 275 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. వారిలో కంటి చూపు లోపం ఉన్న 130 మందికి కంటి అద్దాలు అందజేశామని వైద్యాధికారిణి స్వప్న తెలిపారు. 18 మందికి కంటి ఆపరేషన్ల కోసం రెఫర్ చేశామని చెప్పారు.

కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేట, తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. వైద్య ఆరోగ్య సిబ్బంది, వైద్యులు మొత్తం 3 బృందాలు 449 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 156 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు గుంతకోడూరులో కంటి వెలుగు కార్యక్రమం రెండో రోజు శుక్రవారం కొనసాగింది. గుంతకోడూరులో 150 మందికి పరీక్షలు జరిపి కంటి అద్దాలు అందజేశారు. ఆరుగురికి ఆపరేషన్ అవసరం ఉందని సర్పంచ్ మాధవి, వైద్య సిబ్బంది తెలియజేశారు. ఆవరణంతా కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించి రంగవల్లులతో ఆహ్లాదకరంగా ఏర్పాటు చేశారు.

పెద్దకొత్తపల్లి: కంటి వెలుగు కార్యక్రమం మండల కేంద్రంతో పాటు పెద్దకార్పాముల, వెనచర్ల, ఆదిరాల గ్రామాల్లో కొనసాగుతున్నట్లు డా. రవీన్‌కుమార్ తెలిపారు. రెండో రోజు 715 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. డా.సాయికుమార్, స్మృతియాబేగం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. పెద్దకొత్తపల్లిలో 243 మంది, పెద్దకార్పాములలో 200 మంది, వెనచర్లలో 130 మంది, ఆదిరాలలో 142 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు బాలాజిసింగ్, దేవేందర్, లక్ష్మినరసింహగౌడ్ పాల్గొన్నారు.



కొండ్రావుపల్లిలో...

కోడేరు: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం కోడేరు, కొండ్రావుపల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. కొండ్రావుపల్లిలో 120 మందికి, కోడేరులో 128 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 64 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 16 మందికి కంటి ఆపరేషన్ కోసం రెఫర్ చేసినట్లు తెలిపారు.



తాడూరు: గుంతకోడూరులో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కల్వకుర్తిలో కంటి వెలుగు శిబిరం

పట్టణవాసులకు సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాలరాజు

అచ్చంపేట రూరల్: పట్టణ ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం సీఎం కేసీఆర్ బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశారని, ప్రజల ఆరోగ్యం మెరుగు పర్చడం కోసం అనేక ఆరోగ్య పథకాలను అమలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం అచ్చంపేటలోని ఏడో వార్డులో బస్తీదవాఖానాను ప్రారంభించి మాట్లాడారు. శివారులోని కాలనీల పేద ప్రజల కోసం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశామన్నారు. పేద ప్రజల ఆరోగ్యాలను కాపాడటం కోసం ప్రభుత్వం అనేక ఆరోగ్య సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, మనోహర్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డీలర్లు విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కోడేరు: డీలర్లు విధులపై నిర్లక్ష్యం వహిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్‌బియ్యం పక్కదారి పట్టకుండా లబిదారులకు అందేలా చూడాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళలో రేషన్ దుకాణాన్ని తెరచి ఉంచాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. సకాలంలో డీడీలు చెల్లించాలని కోరారు.

ఆయిల్‌పాం తోటల సాగుకు దరఖాస్తులు

తెలకపల్లి: రైతులు ఆయిల్‌పాం తోటలు సాగు చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ భార్గవ్‌సాగర్ తెలియజేశారు. శుక్రవారం మండల పరిధిలోని గౌరారంలో రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఆయిల్‌పాం మొక్కలను సబ్సిడీపై ఇస్తుందని ఎకరాకు 50 మొక్కలు నాటుకోవచ్చన్నారు. మొక్కలను సాగుచేసే కూలీలకు ఒక మొక్కకు రూ.20 చొప్పున ప్రభుత్వ చెల్లిస్తుందన్నారు. రైతులు ఆయిల్‌పాం తోటలు సాగు చేసేందుకు ఎక్కువ మొగ్గు చూపుతున్నారని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అర్టికల్చర్ కార్యాలయంలో రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సర్పంచ్ చిన్న జమ్ములు, రైతులు కురుమూర్తి, శ్రీనివాసులు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏఈఓ భార్గవ్‌సాగర్

పాలకుల నిర్లక్ష్యంతోనే వెనుకబాటుతనం



మాట్లాడుతున్న అభిలాష్‌రావు

కొల్లాపూర్: పాలకుల నిర్లక్ష్యం కారణంగా కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి వెనుకబాటుకు గురవుతోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కొల్లాపూర్‌లో సమావేశమయ్యారు. దళిత, గిరిజన ఆత్మగౌరవ దండోరా సభపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారానే పంటపొలాలకు నీరు అందుతోందన్నారు. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తిచేస్తారో చెప్పాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు ఎక్కడ అని ప్రశ్నించారు. అభివృద్ధి పథకాలు ముందుకు సాగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. సమావేశంలో నాయకులు కంటి శివన్న, బీరన్నయాదవ్, బాబా, రఫియోద్దీన్, గోపాల్ తదితరులున్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



నాగర్‌కర్నూల్ సమావేశంలో మాట్లాడుతున్న కుంభం మల్లేష్‌గౌడ్



కొల్లాపూర్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: పెండింగ్‌లోని రూ.20,200 కోట్లు ఫీజు రియంబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్‌ను రూ.20 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలకు పెంచుకుంటున్న జీతభత్యాలకు అనుగుణంగానే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను కూడా పెంచాలన్నారు. విద్యా, వైద్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్యయాదవ్, తాళ్ల నిరంజన్, రవీందర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, మేశ లక్ష్మయ్య పాల్గొన్నారు.

కొల్లాపూర్: పెండింగ్‌లోని స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మూలె భరత్ చంద్ర డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం కొల్లాపూర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బకాయిలు చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మండల అధ్యక్షుడు సాయికృష్ణగౌడ్, సత్యనారాయణగౌడ్, శివకృష్ణయాదవ్ పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: బీజేవైఎం ఆధ్వర్యంలో పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. పరశురాములు, కృష్ణగౌడ్, పర్వతాలు, నవీన్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రం హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్, రాజేందర్‌రెడ్డి, కొండల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరింత విస్తరించాలి



కల్వకుర్తి రూరల్: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని వాసవి క్లబ్ 108 గవర్నర్ మేడిసెట్టి రామకృష్ణ అన్నారు. రీజినల్ పరిధిలో రఘుపతిపేట అధ్యక్షుడిగా నరేష్, చారకొండ అధ్యక్షుడిగా కరుణాకర్‌ను నియమించి వారి నుంచి 1010 ఫారంను రామకృష్ణ స్వీకరించారు. కార్యక్రమంలో కల్వ హరికృష్ణ, కలిమిచర్ల రమేష్, శ్రీధర్, లింగం, శ్రీనివాసులు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థినికి క్లాస్‌మేట్ క్లబ్ చేయూత



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థిని ప్రస్తుతం బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న గాయత్రికి క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. డాక్టర్ మంచన శిరీష లక్ష్మణ్ రూ.5 వేలు, వనపర్తి వాసవి ఈవెంట్స్ ఆర్గనైజర్ సంధ్యారాణి రూ.5 వేలు అందజేసినట్లు క్లబ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కటకం వెంకటరాజు తెలిపారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ ఉపాధ్యక్షుడు కొత్త రామకృష్ణ, హెచ్‌ఎం శేఖర్, క్లబ్ సభ్యులు శ్రీనివాసులు, పరశురాములు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే దేశ రాజకీయాల్లో మార్పు



వెల్దండలో మాట్లాడుతున్న బాలాజీసింగ్

వెల్దండ: భారత రాష్ట్ర సమితితో దేశ రాజకీయాల్లో కీలక మార్పులు వస్తాయని జిల్లా వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ పేర్కొన్నారు. శుక్రవారం వెల్దండలో విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ దేశవ్యాప్తంగా రైతుల సంక్షేమం కోసం కృషిచేస్తారన్నారు. దేశంలోని ఆయా రాష్ట్రాల సీఎంలు కేసీఆర్‌కు మద్దతుగా తరలివస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచినట్లు పేర్కొన్నారు. ఖమ్మంలో నిర్వహించిన సభతో దేశ రాజకీయాల్లో మార్పులు తీసుకురావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రామస్వామి, శంకర్‌నాయక్, సాజ్యానాయక్, రమేష్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

'ఆకు ప్లేట్లను వినియోగించాలి'



ప్లేట్లను ఆవిష్కరిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

కల్వకుర్తి: కుటీర పరిశ్రమలో సరికొత్త ఆలోచనలతో కల్వకుర్తికి చెందిన దుర్గాప్రసాద్, రాజేందర్ ప్రకృతి ఆకుల ప్లేట్లను తయారు చేసే కుటీర పరిశ్రమను ఏర్పాటు చేశారు. శుక్రవారం రాష్ట్ర పర్యావరణ అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రకృతి ఆకులతో తయారు చేసిన ప్లేట్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్లాస్టిక్‌ను తరిమికొట్టి ఆకుతో తయారు చేసిన ప్లేట్లను వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీ రాములు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, కలెక్టర్ ఉదయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సత్యం, కౌన్సిలర్ సైదులుగౌడ్, పరిశ్రమ యజమానులు దుర్గాప్రసాద్, రాజేందర్ ఉన్నారు.

ఉమామహేశ్వరంలో ఎంపీ రాములు పూజలు



ఎంపీని సన్మానిస్తున్న ఆలయం ఈఓ

అచ్చంపేట రూరల్: శ్రీశైలం ఉత్తరముఖ ద్వారమైన ఉమామహేశ్వ పుణ్యక్షేత్రంలో శుక్రవారం నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాప నాశనం గుండం వద్ద పుణ్యస్నానం ఆచరించి గణపతి పూజ, అమ్మవారికి కుంకుమార్చన, శివుడికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఎంపీని ఈఓ శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌గౌడ్, నాగయ్యగౌడ్ పాల్గొన్నారు.

'దళిత, గిరిజన ఆత్మగౌరవ సభకు తరలిరండి'



సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్య

కొల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 22న నిర్వహించే దళిత, గిరిజన ఆత్మగౌరవ దండోరా సభకు దళిత, గిరిజనులు తరలిరావాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కొల్లాపూర్‌లో చింతలపల్లి జగదీశ్వర్‌రావు కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తోందన్నారు. కొడిదల రాము, రాముయాదవ్, పరశురామ్, కాంతారావు, కిరణ్, కురుమయ్య, శివానందం, వెంకటస్వామి, రాంచందర్ పాల్గొన్నారు.

దళిత గిరిజనులు తరలిరావాలి

బిజినేపల్లి: దళిత గిరిజన ఆత్మ గౌరవ సభకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దళిత గిరిజనులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి విజయరెడ్డి అన్నారు. శుక్రవారం తిమ్మాజిపేట మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సభకు టీపీసీసీ రేవంత్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. దళిత గిరిజనులపై జరిగిన దాడులను, అవమానాలను దృష్టిలో పెట్టుకుని ప్రతిఒక్కరూ హాజరుకావాలన్నారు.

'ఎమ్మెల్యేకు ధనార్జనే ధ్యేయం'

ప్రజల సంక్షేమం, బడుగు బలహీన వర్గాల బలోపేతం కన్నా.. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తన ధనార్జనే ధ్యేయంగా నియోజకవర్గాన్ని పాలిస్తున్నారని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ప్రదీప్‌గౌడ్ ఆరోపించారు. జనవరి 22న నిర్వహించనున్న దళిత గిరిజన ఆత్మగౌరవ సభకు మండల ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేకు దళితులంటే చులకన భావం ఉందని, అందుకే వారిపై పరోక్షంగా దాడులు చేయిస్తున్నాడని ఆరోపించారు. విలేకరులతో కొడిదెల రాము, సుహాసన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: దళిత గిరిజనులపై జరుగుతున్న దాడులు అరికట్టడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అభిలాష్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలో విలేకర్లతో మాట్లాడారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం బిజినేపల్లి మండలంలో దళితులపై అధికార పార్టీ నాయకులే దాడులు చేస్తున్నారన్నారు. గిరిజన ఆత్మ గౌరవ సభకు ఉమ్మడి జిల్లా నుంచి దళిత, గిరిజనులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఐక్యత ఫౌండేషన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



వినికిడి మిషన్ అందజేస్తున్న ఐక్యత ఫౌండేషన్ సభ్యులు

వెల్దండ: పేద విద్యార్థులకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చొక్కన్నపల్లికి చెందిన పీజీ చదువుతున్న విద్యార్థి జగన్‌కు రూ.20 వేల విలువ చేసే వినికిడి మిషన్ అందజేశారు. జగన్ చిన్ననాటి నుంచి వినికిడి సమస్యతో బాధపడుతున్నాడు. పేద కుటుంబం కావడంతో మిషన్ కొనుగోలు చేసే స్తోమత లేకపోవడంతో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన వినికిడి మిషన్ అందించాలని ఫౌండేషన్ సభ్యులకు సూచించారు. వారి ఆదేశాల మేరకు శుక్రవారం బాధిత విద్యార్థికి మిషన్ అందజేశారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలి



వెల్దండలో మాట్లాడుతున్న ఆర్డీఓ రాజేష్‌కుమార్

వెల్దండ: ఓటరుకార్డుకు ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలని కల్వకుర్తి ఆర్డీఓ రాజేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం వెల్దండ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పోలింగ్ బూత్ వారీగా ఓటరుకార్డులకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. బీఎల్‌ఓలు ప్రతి ఓటరును సంప్రదించి ఆధార్‌ను వేగవంతం చేయాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ భూములను పరిరక్షించుకోవాలన్నారు. రియల్ వ్యాపారులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, డీటీ శ్రీను, ఆర్‌ఐ శ్రీనునాయక్, తదితరులు ఉన్నారు.

పందిరి కూరగాయల సాగు పరిశీలన



కూరగాయల సాగు పరిశీలిస్తున్న నాబార్డ్ అధికారులు

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలో నాబార్డ్ డీఎం షణ్ముకాచారి ఆధ్వర్యంలో శుక్రవారం పందిరి సాగు కూరగాయలను పండిస్తున్న రైతుల తోటలను సందర్శించారు. 12 రకాల కూరగాయల సాగు కాకర, క్యారెట్, బీట్‌రూట్, చిక్కుడు, ఆకు కూరలు లాంటి పంటలను సందర్శించి రైతులకు ఆర్గానిక్ విధానంలో ఎక్కువ సాగు చేయాలని సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్ నరేందర్ బాబు, రైతులు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.